

# తాపత్రయం

న్యాయపతి కమలా రాంజీ

నీరజ బరువెక్కిన గుండెతో నెమ్మదిగా వంటింట్లో అడుగు పెట్టింది. ఆ వంటిల్లంతా అందంగా అమర్చబడి ధగధగా మెరిసే స్టీలుసామాన్లతో ఒక స్టీలు సామాన్లమ్మే దుకాణంలా కనిపించి మనసులో కెలికినట్లయింది! గుండెని ఎవరో అంపంతో కోస్తున్న చేదు అనుభూతి! ఈ గుండె కోతపై నిర్లిప్తత అనే పూత వేసి గుట్టుగా దాచేసుకుందామన్నా సాధ్యం కావడం లేదు. ఆ వంటిల్లు చూస్తూంటే నీరజకి దుఃఖం తన్నుకొస్తోంది. అదొక స్టీలు సామ్రాజ్యం! ఆ సామ్రాజ్యానికి మహారాణి... అమ్మ! ఆమె బ్రతికున్నప్పుడు ఎవర్నీ స్టీలు గిన్నెలని ముట్టుకోనిచ్చేదికాదు. పొరపాట్న ఎవరి చేతిలోంచైనా గిన్నె జారిపడితే ఆ రోజు వాళ్లకి తిట్లే భోజనం! ప్రతీ గిన్నె నోరుతెరుచుకుని తన్ని "అమ్మ ఏది నీరజా?" అని అడుగుతున్నట్టే అనిపిస్తోంది! నీరజకి చెప్పలేనంత ఏడుపొచ్చింది. "అదేమిటి! ఒక స్టీలు గిన్నె ఆయుర్దాయం అమ్మ ఆయుర్దాయంకంటె ఎక్కువా! ప్చ్. కోరి ఆయుర్దాయాన్ని తక్కువ చేసుకునే వాళ్ళని ఎవరేం చేయగలరు!" అనుకుంది.

అయినా మనిషి బ్రతుకు ఎంత అశాశ్వత మైనది! మూణ్ణాళ్ల ముచ్చటైన ఈ జీవితం కోసమా యింత తాపత్రయం!

"ఈ చీరనాది! ఈ బంగారం నాది! ఈ గిన్నెనాది! ఈ యిల్లు నాది!" అని ప్రతిదీ తనది, తనేదో శాశ్వతంగా యిక్కడ వుండి పోయినట్టు తాపత్రయ పడిపోతాడు మనిషి! జీవితం ఎంత క్షణభంగురం! నీటి బుడగలాంటి జీవితంలో 'నాది' అనే తాపత్రయం ఎంత మూర్ఖత్వం! వుబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకుందికి విశ్వప్రయత్నం చేస్తూ అక్కడే ఓ మూల అలసటగా గోడకి చేరబడి పోయింది నీరజ. మూసుకున్న కనురెప్పల వెనుక గతంలోని కొన్ని సంఘటనలు సినిమారీళ్లలాగ కదిలేయి......

* * *

మే నెల ఎండలు. ఉదయం తొమ్మిదయింది. ప్రభాకరుడు అప్పుడే తన ప్రభావాన్ని చూపిస్తున్నాడు. లలితమ్మ రెండు చేతుల్లోనూ రెండు బరువైన సంచులున్నాయి. ఒక సంచీలో పది కేజీల మామిడికాయలు వున్నాయి. మరొక సంచీలో, నిండా కూరగాయలున్నాయి. లలితమ్మ యిల్లు బొంకుల దిబ్బదగ్గర లక్కపందిరి వీధిలో వుంది. కాని అక్కడ కూరగాయల ధర ఎక్కువ చెప్తారని పెద్ద బజారుకి బయలుదేరింది. కూరగాయలు కొని ఒక సంచీ పూర్తిగా నింపేసి, మామిడికాయల బేరం కుదరక యించుమించు గంటస్థంభం దాకా వచ్చింది. అక్కడ కాయలు కొనడం పూర్తయింది.

ఎండకి ఆమె శరీరం చెమట్లు పట్టేసింది. అసలే అర్భకంగా, నీరసంగా వుంటుంది. దానికితోడు ఆ రోజు శనివారం. ప్రతీ శనివారం కటిక వుపవాసం చేస్తుంది. ఆ రోజు పొద్దున్నించీ ఏమీ తాగలేదు. తులసి తీర్థం రెండు గుక్కలు నోట్లో పోసుకుంది. **అంతే. హార్లిక్స్, మాల్టోవా లాంటివి మడికి పనికిరావుట. ఆమె చాదస్తం ఆమెది! రెండు** చేతుల్లో రెండు బరువైన సంచీలు మోసుకుంటూ **అంత ఎండలో నడవడం అంటే కష్టమే. అయినా ఆమె పట్టుదలగా నడుస్తున్నది. ఆ పంతం,** పట్టుదల **అంతా** రిక్షావాళ్ళమీద. **అసలు ఆ బరువైన** రెండు సంచుల్ని మోసుకుంటూ యింటి దాకా నడవగలనన్న నమ్మకం చాలక మొదట ఒకరిక్షా వాడ్ని పిల్చింది.

"ఏయ్. రిక్షా? బొంకుల దిబ్బదగ్గరికి ఏం తీసుకుంటావు?"

రిక్షావాడు ఆగి లలితమ్మ చేతుల్లో వున్న సంచీల వైపు ఒకసారి చూసేడు. తర్వాత లలితమ్మ వైపు చూసి చెప్పేడు.

"రెండున్నర యిప్పించండి."

లలితమ్మకి ఆశ్చర్యం, కోపం రెండూ ఒక్కసారే కలిగేయి.

"ఏమిటీ! యిక్కడున్న బొంకుల దిబ్బకి రెండున్నరా? ఏవూరయ్యా మీది! కొత్తగా వచ్చేవా?" అంది సాగదీస్తూ.

రిక్షావాడికి చిర్రెత్తుకొచ్చింది.

"బొంకులదిబ్బ యిక్కడుందంటున్నారు! మరెందుకు రిక్షా. నడిచి వెళ్ళిపోండమ్మా!" అన్నాడు ఎగతాళి చేస్తూ.

తను బేరమాడ దామనుకునేలోగానే ఎవరో పెద్ద మనిషి, బాగా డబ్బున్న వాడిలా వున్నాడు, వచ్చి, బేరం ఆడకుండానే రిక్షా ఎక్కి కూర్చున్నాడు! **లలితమ్మకి వళ్ళు మండిపోయింది. మరో రిక్షాని** పిల్చింది. వాడూ రెండున్నరే చెప్పేడు. తను ముందుకు నడుస్తున్న కొద్దీ దూరం తరిగి పోతున్నది. కాని రిక్షావాళ్ళ రేటు మాత్రం అంతే వుంటున్నది. ఇది చాలా అన్యాయం అనిపించింది ఆవిడకి.

"సరి అయిన బేరం చెప్పు." అంది లలితమ్మ.

"రెండు రూపాయిలివ్వండి." ఏదో జాలి తల్చినట్టుగా అన్నాడు. లలితమ్మ ఒక నిముషం ఆలోచించింది. బొంకులదిబ్బ దగ్గరకూరగాయలు ధరలు ఎక్కువ చెప్తారని, రెండు మూడు రూపాయలు మిగల్చవచ్చనే కదా యింత దూరం కాళ్ళీడ్చుకుంటూ వచ్చింది! ఇప్పుడు రిక్షాకి పెట్టేస్తే ఏం లాభం! ఏదో ఒక రూపాయైతే ఆ నష్టం ఎలాగో భరించవచ్చు. అదీనూ ఎండ ఎక్కువగా వుంది కాబట్టి!

లలితమ్మ యింకా మాట్లాడక పోవడం చూసి రిక్షావాడు అన్నాడు. "పోనీ మీరు ఎంతిస్తారో చెప్పండమ్మా?"

"నేను ఒకరూపాయికంటె ఎక్కువ యివ్వను. అప్పుడే సగందూరం నడిచి వచ్చేసేను. నీ కిష్టం అయితే రిక్షాకట్టు. లేకపోతే లేదు." అంది లలితమ్మ ఖచ్చితంగా. "తను అనుకున్న రూపాయికే ఏ రిక్షావాడైనా వచ్చినా సరే లేకపోతే తను నడిచే వెళ్తుంది." అని నిర్ణయించుకుంది. ఆయాసంతో రొప్పుతూ నడుస్తూనే మధ్య మధ్యలో సంచుల్ని కిందకిదించి మళ్ళీ చేతుల్లోకి తీసుకుంటూ, మరో యిద్దరు ముగ్గురు రిక్షా వాళ్ళని కేకేసింది. ఇద్దరు వినిపించుకోకుండా వెళ్ళిపోయేరు. ఒకడు మాత్రం రూపాయిన్నరకి కడ్తానన్నాడు. అప్పుడన్నా అర్ధరూపాయి దగ్గర పట్టింపు ఏమిటి అని లలితమ్మ అనుకోలేదు. ఆవిడ పంతం అలాంటిది! ఒక రూపాయి అనుకుంటే ఒకరూపాయే యిచ్చి ఎక్కాలి. అంతకంటె అయిదు పైసలు కూడా ఎక్కువ యివ్వడానికి ఆవిడ మనసు అంగీకరించదు.

ఇంటి దాకా నడుచుకొచ్చే సరికి మరి పాదాల్లో శక్తిలేనట్టు, నోట మాట రానట్టుగా అక్కడే, యింటి ముందు మెట్ల మీద చతికిల పడిపోయింది. గుండె గొంతులోకి వచ్చినట్టుగావుంది. నాలుక పిడచ కట్టుకు పోయింది. నీరసం, నిస్సత్తువ ఆవహించేయి.

"అమ్మ యింకా రాలేదేమిటి?" అనుకుంటూ వీధిలో కొచ్చిన నీరజ తల్లి వాలకం చూసి గతుక్కుమంది. ముందు రెండు సంచుల్ని గబగబా లోపలుంచేసి వచ్చి తల్లి చేయి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళి మంచం మీద పడుకోబెట్టి ఫ్యాను వేసింది. మంచినీళ్ళు తెచ్చి అందిస్తున్న కూతుర్ని తేరిపార చూసింది లలితమ్మ.

"ఇవాళ శనివారం కదా. నేను ఏ నీళ్ళుపడితే ఆ నీళ్ళు తాగేస్తే నా మడి ఏమయిపోవాలే!" అని అంత నీరసంలోనూ ఖస్సుమంది. తల్లి చాదస్తానికి వళ్ళు మండిపోయింది నీరజకి.


"ఏంటమ్మా. మడి మడి అని కూర్చుంటావు. మంచినీళ్ళు, శుభ్రమైనవి నేను స్వయంగా తెచ్చియిస్తే అవి పనికిరావా! చల్లటి మంచినీళ్ళు కొంచెం తాగు. హాయిగా వుంటుంది." అంటూ బలవంతం చేసింది. లలితమ్మ వద్దుగాక వద్దంది. **"మంచినీళ్ళకే యింతరాద్ధాంతంచేసే తల్లి యిహ** హార్లిక్స్ కలిపి యిస్తే పుచ్చుకుంటుందా! హమ్మో." అనుకుని ఆ పని చేయబోయి విరమించుకుంది.

"రిక్షాలో వచ్చేలేక పోయేవమ్మా! అంత దూరం నించి ఎండలో రావడం అంటే తమాషానా? అందులోనూ నీ ఆరోగ్యం కూడా అంత మంచిదికాదు" అంది బాధపడుతూ.

లలితమ్మ కోపంగా చూసింది కూతురి వైపు.

"ఈ రిక్షావాళ్ళకి బుర్ర తిరుగుడు ఎక్కువై పోయిందే. ఎంతిచ్చినా చాలదంటారు! లేకపోతే ఏమిటీ గంట స్థంభంనించి యిక్కడికి రెండు రూపాయిలివ్వాలట. వాడి బాబుగాడి సొమ్ము వుంది యిక్కడ!" అంది. పోనీ యింట్లో యింకెవరన్నా బజారు కెళ్ళి కూరగాయలు అవీ తెస్తానంటె ఆవిడకి నమ్మకం చాలదు. వాళ్ళకి సరిగ్గా బేరమాడ్డం తెలీదని, తెలివి తక్కువ వాళ్ళని, వాళ్ళు ఎంతంటే అంతా యిచ్చి చెత్తరకం తెచ్చేస్తారని, డబ్బు దుబారా చేసేస్తారని ఆవిడ అనుమానం!

* * *



# తాపత్రయం

నీరజకి తల్లి ధోరణి కొత్త కాదు. ఆమె రిక్షావాళ్ళతోనూ, కూరల వాళ్ళతోనూ ఎలా గీసి గీసి బేరమాడుతుందో తనకి బాగా తెల్సు! రిక్షా వాళ్ళతో పంతానికిపోయి రిక్షా ఎక్కకుండానే ఎంత దూరమైనా ఆపసోపాలు పడిపోయి ఎలా నడచుకు వస్తుందో నీరజకి బాగా అనుభవం! అసలు తల్లి మనసు అర్థం చేసుకోవడం అన్నది ఆమెకి చాలా కష్టమైన పనిగా తోస్తుంది. రిక్షావాడికి ఒక రెండు రూపాయిలిస్తే తన ఆస్తినంతా ఎవరికో ధారపోసినట్లుగా బాధపడి పోతుంది. భోజనం విషయంలోనూ అంతే. అందరికీ పప్పు వేస్తుంది. తను వేసుకోదు. ఎందుకంటే నాకు 'సహించదు' అంటుంది. కాని అమ్మ 'పొదుపు' సంగతి తనకి తెల్సు. కూర కూడా అందరికీ ఎక్కువ వేసేసి తను మాత్రం పచ్చడి వేసుకున్నంత వేసుకుంటుంది! "నాకిది చాలు. ఇంకెంత తినేస్తాం" అంటుంది పైగా. అన్నం, చారు, మజ్జిగ, ఆవకాయ ఈ నాలుగింటితోనే ప్రతీ రోజూ భోజనం అయిందని పించేస్తుంది. మజ్జిగ కూడా కొంచెం వేసుకుని ఆపైన నీళ్ళు పోసేసుకుని అన్నం కలిపేసుకుంటుంది. అదేమని అడిగితే "యిలాగే బలం" అంటుంది. ఏది బలమైన ఆహారమో తనకి తెలీదూ?! అమ్మ ఎవ్వరి మాటా వినదు. తనకి ఏది తోస్తే అదే.

"ఏంటమ్మా, ఆ తిండి? ఇలా తింటే ఏం అవుతావు? ఆరోగ్యం పాడయిపోదూ?" అంటే...

"ఇప్పుడు నాకేమైందే? నిక్షేపంలా వున్నాను." అంటుంది!

"మరి ఎందుకు దగ్గుతున్నావు? అప్పుడప్పుడు గుండెనొప్పి, కడుపులో నొప్పి అంటావు! ఇదంతా ఏమిటి?" అంటే

"ఏమిటే నీరజా! మనిషన్నాక రోగాలు రాకుండా వుంటాయా? ఆ మాత్రం దగ్గకుండా, తుమ్మకుండా ఎవరైనా వుంటారా? నువ్వు అన్నిట్లోనూ నాకు నీతులు చెప్పకు. నాకు అన్నీ తెల్సు. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట!" అని తన మాటల్ని కొట్టిపారేస్తుంది!

ఆమెకు తల్లి ప్రవర్తనని చాదస్తం అనుకోవాలో, పిచ్చి అనుకోవాలో, పొదుపు అనుకోవాలో, పిసినారితనం అనుకోవాలో ఏమనుకోవాలో తెలీటం లేదు. వారంలో మూడు రోజులు వుపవాసం చేస్తుంది అమ్మ. ప్రతీ రోజూ తెల్లవారు ఝామున నాలుగ్గంటలకే లేచి పోయి చన్నీళ్ళతో నూతి దగ్గరే స్నానం చేసేస్తుంది. ఎంత చలికాలమైనా అంతే. జలుబు, దగ్గువున్నా, జ్వరం వున్నా అలాగే మొండిగా స్నానం చేసేసి యింటెడు పని చేస్తుంది. మరెవ్వరు చేసినా ఆవిడకి తృప్తి వుండదు. అసలు మరెవ్వరి పనీ ఆవిడకి నచ్చదు. ఏమిటో! అమ్మలో మార్పు ఎప్పుడు వస్తుందో!....

తల్లి లేవడం చూసి ఆలోచనల్లోంచి తేరుకుని తనూ లేచి వంటింట్లోకి వెళ్ళింది నీరజ.

* * * * * *

సాయంత్రం నీరజ ఆఫీసు నుండి వచ్చేసరికి లలితమ్మ ఏదో కుడుతున్నది శ్రద్ధగా.

"ఏమిటమ్మా? ఏమిటి కుడుతున్నావు?" అని అడిగింది నీరజ తల్లిని.

"శ్రీరాముల వారికి, సీతా అమ్మవారికి, లక్ష్మణ స్వామికి పట్టుబట్టలు కుడుతున్నానే. అయిపో వచ్చింది. బాగున్నాయా? చూడు." అంటూ ఒక్కొక్కటి విప్పి చూపించింది.

"రేపు శ్రీ సీతారాముల కల్యాణం! ఈ సంవత్సరం నేను దేవుడి కల్యాణం చేయిస్తున్నాను. సీతారాముల కల్యాణం చేయిస్తే నీకు కల్యాణం కలుగుతుందని...." అంటున్నదల్లా ఆపేసి కూతురి ముఖం వైపు చూసి వూరుకుంది.

"ఎన్నిసార్లు చెప్పాలమ్మా. నేను యిప్పట్నుంచి పెళ్ళి చేసుకోనని. అయినా ప్రాణంలేని రాతి బొమ్మలకి కల్యాణం ఏమిటమ్మా నీ పిచ్చిగాని! అదొక మిష పెట్టుకుని నీలాంటి వాళ్ళందరి దగ్గర బాగా లాగాలని వాళ్ళ తాపత్రయం కాకపోతే. దేవుడి కల్యాణం చేయించని వాళ్ళకి పెళ్ళిళ్ళే అవడం లేదా?! చెప్పు. నీకంతగా పుణ్యం చెయ్యాలని కోరిగ్గావుంటే ఎవరైనా పేద పిల్లకి నీ డబ్బు ఖర్చుపెట్టి పెళ్ళి చెయ్యి" ఆవేశంగా అంది నీరజ.

"తప్పు. లెంప లేసుకో ముందు. దేముణ్ని పట్టుకుని అంతంత మాట లనడానికి నీకు నోరెలా వచ్చింది? వూఁ! ముందు లెంప లేసుకో!"

"నేను వేసుకోను. నేనేం తప్పు చెయ్యలేదు." బింకంగా అంది నీరజ.

"ఉత్త మొండి ఘటం. దీనికి పెళ్ళెలా అవుతుందో ఏమిటో? శ్రీ రామచంద్రా! నువ్వే కాపాడాలి నా కూతుర్ని" దేవుడి పటం వైపు చూసి రెండు చేతులు జోడించి దణ్ణంపెడుతూ గొణుక్కుంది లలితమ్మ.

రిక్షావాళ్ళ దగ్గర, కూరలవాళ్ళ దగ్గర గీసి గీసి బేరం చేసే తల్లి దేవుడి కార్యం అనేసరికి యింత దుబారాగా ఎందుకు ఖర్చు చేస్తుందో నీరజకి అర్థం కావడం లేదు. బహుశా పాప భీతో లేక పుణ్యం సంపాదించాలనే తపనో అయి వుంటుంది. సమాజంలో అమ్మలాంటి ఆడవాళ్ళు చాలామంది వుంటారు. వీళ్ళ మూఢనమ్మకాన్ని, అంధ విశ్వాసాలని దేవుని పేరు చెప్పి మరికొందరు క్యాష్ చేసుకుంటున్నారు హాయిగా!

"నాన్నకి పెన్షన్ వస్తుంది. అన్నయ్య డబ్బు పంపిస్తున్నాడు. నేను ఉద్యోగం చేస్తున్నాను. అదికాక అన్నయ్య నీకు వేరేగా డబ్బు పంపిస్తున్నాడు! ఎందుకో తెలుసా అమ్మా? నువ్వు నీరసంగా వున్నావని! పళ్ళు కొనుక్కుని తినమని, హార్లిక్స్, బోర్నవీటా, కాంప్లాన్ లాంటివి తాగమని. నువ్వు ఆరోగ్యంగా వుండాలని పంపిస్తున్నాడు! నువ్వేమో ఆ డబ్బంతా దేవుడు, పూజలు, రుద్రాభిషేకాలు, అర్చనలు, కల్యాణాలు, వీటికి ఖర్చు చేస్తున్నావు. వుపవాసాలు వుంటూ! అసలు నీకు బుద్ధి లేదు. నీ ఆరోగ్యం ముఖ్యమా? ఇవన్నీ ముఖ్యమా?" అందామనుకుంది, కాని అన్నా ప్రయోజనం లేదని తెల్సి వూరుకుంది.

మర్నాడు పొద్దున్నే పెరట్లోంచి తల్లికేకలు వినిపించి పెరట్లోకి వెళ్ళింది నీరజ గాభరాగా.

పని మనిషితో దెబ్బలాడుతున్నది లలితమ్మ. అది కొడుక్కి వంట్లో బాగాలేదని కిందటి నెలలో నాలుగు రోజులు పనిలోకి రాలేదు. నెలకివ్వాల్సిన ముప్పయిరూపాయల జీతంలోంచి ఆ నాలుగు రోజుల జీతం నాలుగు రూపాయలు కట్‌చేసి మిగతాది దాని చేతిలో పెట్టింది లలితమ్మ.

అది ఎంత ఏడ్చి మొత్తుకున్నా, బతిమాలినా లలితమ్మ మనసు కరగలేదు. పైగా రెచ్చిపోయి తిట్టడం మొదలెట్టింది ఆవిడ. దాంతో పాపం రంగమ్మ చేసేది లేక వెళ్ళిపోయింది.

"ఏం బాపనమ్మవి! నువ్వు పొయ్యేటప్పుడు యిదంతా పట్టుకుపోతావా? చంటాడికి వంట్లో బాగులేక నాను పన్లోకి రాలేదు. కావలిస్తే నానెవరిల్లలో పన్జేస్తున్నానో ఆల్లందర్నీ అడుగు. ఆల్లెవరూ మానాగ జీతం కోసేనేదు. నానెందుకు

## 'ఆవారా' ఘనత

దేశ, విదేశాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన రాజ్‌కపూర్ స్వంత చిత్రం 'ఆవారా'లో మూడు తరాలవారు నటించారట. హీరో, నిర్మాత, దర్శకుడు అయిన రాజ్‌కపూర్‌తో పాటు ఆయన తండ్రి పృధ్వీరాజ్‌కపూర్, తాత బదరీనాథ్‌కపూర్ ఆ చిత్రంలో నటించారు. రాజ్‌కపూర్ సోదరుడు శశికపూర్ కూడా ఈ చిత్రంలో బాలనటుడిగా నటించాడు. ఈ విధంగా మూడు తరాలవాళ్ళు ఒకే సినిమాలో నటించిన ఘనత కపూర్ కుటుంబానిదీ, ఆవారా చిత్రందీను.

1951లో విడుదలైన ఈ చిత్రం మనదేశంలో అత్యంత ప్రజాదరణ పొందటమే గాక సోవియెట్ యూనియన్‌లో కూడా విశేషాదరణ పొంది అక్కడ రాజ్‌కపూర్‌కు అభిమానులనెందరినో సంపాదించి పెట్టింది.

అబద్దం ఆడతాను!...'' రంగమ్మ వెళ్ళిపోతూ మెల్లగా గొణుక్కోవడం నీరజ చెవుల్లో పడింది

''ఒక నాలుగు రూపాయిల కోసం అమ్మ ఎంత మూర్ఖంగా ప్రవర్తిస్తోంది? ఇలా మూర్ఖంగా అమ్మలా ప్రవర్తించేవాళ్ళు యింకావున్నారా?వుండే వుంటారు! మధ్య తరగతి కుటుంబాల్లో అక్షరజ్ఞానంలేని చాలామంది ఆడవాళ్ళు యిలాగే ప్రవర్తిస్తారేమో!...'' అనుకుంది బాధగా.

దేముడికోసం కుట్టిన పట్టుబట్టలు... అమ్మదేవుడి కల్యాణం కోసం పెట్టేఖర్చు... అంతా జ్ఞాపకంవచ్చింది. దేవుడు ఎక్కడున్నాడు? దేవుడు రాతి బొమ్మల్లోలేడు. మన చుట్టూ వున్న పేదల గుండెల్లో వున్నాడు! దీనుల హృదయాల్లో వున్నాడు. వళ్ళువంచి కష్టపడి రాత్రనక, పగలనక; ఎండనక పన్చేస్తున్న రిక్షావాడిలో వున్నాడు దేవుడు! కడుపుకి జరక్క, కన్నపిల్లల్ని ముష్టివాళ్ళని చెయ్యలేక నాలుగిళ్ళల్లో పాచి పని చేసుకుని దీనంగా, రోజులు వెళ్ళదీస్తున్న రంగమ్మలో వున్నాడు దేవుడు! వీళ్ళకి సహాయం చేస్తే దేముడు సంతోషించడా?'పెన్నీవైజ్ ఫౌండ్ ఫూలిష్' అన్నట్టు అమ్మలాంటి ఆడవాళ్ళు చాలామంది అజ్ఞానంలో పడి కొట్టుకుపోతూ తాము చేసేపన్లే చాలా మంచివనీ, తామే తెలివైనవాళ్ళని, యితరులు ఏమీ చేతకానివాళ్ళని అనుకుంటూ వుంటారు!దేవుడికోసం ఎంతైనా ఖర్చుపెట్టడానికి వెనుదీయని వీళ్ళు ముష్టివాడికి పదిపైసలు వెయ్యడానికి గింజుకు పోతారు! విచిత్రమైన మనస్తత్వాలు వాళ్ళవి!...

పని మనిషితో దెబ్బలాడి, దానిమీద కేకలువేసి నోరు నొప్పిపుట్టి, గుండె దడదడలాడుతూంటే వచ్చి నిస్సత్తువగా కుర్చీలో కూర్చుంది లలితమ్మ. అంతలా గొంతు చించుకు అరిచినందుకు విపరీతమైన నొప్పితో ఆమె గొంతు గరగర లాడుతోంది. పెదవులు యింకా అదురు తున్నాయి. గుండెలు వేగంగా కొట్టు కుంటున్నాయి! మాట్లాడ లేనట్టుగా చేత్తో సంజ్ఞ చేసి నీరజకి చెప్పింది మాత్ర తెమ్మని. నీరజ వంటింట్లోకెళ్ళి తల్లి మాత్రల డబ్బీ మూత తీసింది. ఏవో రకరకాల మాత్రలన్నీ వున్నాయి దాన్నిండా. అన్నీ కల్సి అదొ కరకమైన కంపు కొడుతున్నాయి. కొన్ని డేట్ ఎక్స్‌పైర్ అయిపోయినవి కూడా వున్నాయి! అవి కూడా భద్రంగా దాచుకుంది ఆవిడ. పారేదం అన్నది ఆవిడ డిక్షనరీలో లేదు. ఎక్కడ ఏ మాత్ర కనబడితే ఆ మాత్ర వెంటనే నోట్లో పడేసుకుంటుంది.

''అదేమిటమ్మా! ఆ మాత్ర పేరేమిటో, ఎందుకు పనికొస్తుందో చూసుకోకుండానే వేసేసుకుంటున్నావు?'' అంటే–

''ఆఁ పోనీద్దూ. మాత్రలన్నీ వళ్ళు బాగవడానికేకదా తయారు చేస్తున్నారు! నా వంట్లో ఎన్నో రకాల రోగాలున్నాయి. దేనికైనా పని చెయ్యదా?'' అంటుంది నిర్లక్ష్యంగా. పోనీ అమ్మకి తెలీకుండా విసిరి పారేద్దామంటే తన్నినంత పని చేస్తుంది. తనకు తెలియకుండా అలాంటి పనికిరాని మాత్రలన్నీ యింకెక్కడో దాచేసుకుని మరీ వేసుకుంటుంది! అందుకే మాట్లాడకుండా ఆ డబ్బీతెచ్చి తల్లికిచ్చేసి అయోమయంగా చూస్తూ నిల్చుంది నీరజ. తల్లిని ఏమనడానికి ధైర్యంచాలదు ఆ అమ్మాయికి. ఏమన్నా అంటే ఆవిడ తిరిగి గట్టిగా కేకలేస్తే ఆవిడ గొంతునొప్పి ఎక్కువై పోతుంది... తన మూలంగా! అందుకే వూరుకుంది. ఆ మాత్రల కయ్యే ఖర్చు రంగమ్మకివ్వాల్సిన దానికంటే ఎక్కువే! అలా గొంతుక నొప్పిపుట్టేలా, నరాలు వణికిపోయేలా, గుండెలు అదిరిపోయేలా కేకలు పెట్టడం ఎందుకు? ఆ తర్వాత డబ్బు ఖర్చుపెట్టి మాత్రలు కొనుక్కొని వేసుకోవడం ఎందుకు? అంతకోపం... అంత పంతం... ఆ వయసులో అసలు మంచిదికాదు. ఆవిడకి హై బి.పి. కూడా వుంది!

ఆ యింట్లో లలితమ్మ మాటకి తిరుగులేదు. ఆవిడ చెప్పింది భర్త, పిల్లలు విని తీరాలి. వినకపోతే రాద్ధాంత సిద్ధాంతం చేసి పెద్ద కేకలు పెట్టేసి నీరసం తెచ్చేసుకుంటుంది. ఆ తర్వాత మాత్రలకని వీళ్ళే పరుగెత్తాలి. అందుకే ఎవ్వరూ ఆవిడ మాటలకి ఎదురు చెప్పరు. అందరూ సర్దుకుపోవడం నేర్చుకున్నారు. వాళ్ళు సర్దుకు పోతున్నారని అనుకోదు ఆవిడ. తను చేసేది 'మంచి' కాబట్టే వాళ్ళు వూరుకుంటున్నారని అనుకుంటుంది.

మరో నాలుగు రోజులకి లలితమ్మ చిన్న స్టీలు గిన్నె కనిపించడం లేదని మళ్ళీ పనిమనిషితో తగవు పెట్టుకుంది.

''స్టీలుగిన్నె నువ్వే తీసేవు. ఇంట్లో ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడికి పోతుంది. నువ్వు తియ్యకపోతే? మర్యాదగా తెచ్చి యిచ్చే'' అని కేక వేసింది లలితమ్మ.

''నేదమ్మా. నా నటుమంటిదాన్నిగాను. మీ యింటనే ఏమూలనో వుంటాది. సూస్కోండి. నా మాట నమ్మండి.'' అని రంగమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

**నీరజకి చిరాకేసింది. ఏమిటి రోజు రోజుకీ అమ్మకి** తాపత్రయం ఎక్కువై పోతున్నాది. వంటింటినిండా పెద్దా, చిన్నా బోలెడన్ని స్టీలు సామాన్లు వున్నాయి. వంటింట్లోకి అడుగు పెడితే చాలు అదొక స్టీలు సామాన్ల షాపులా కనబడుతుంది! అంత అందంగా, నేర్పుగా అమర్చింది స్టీలు సామాన్లని అమ్మ! లెక్కలేనన్ని గిన్నె లుండగా ఒక చిన్న స్టీలు గిన్నె, పావు లీటరు పాలు కూడా పట్టని ఆ గిన్నెమీద అంత మోజెందుకు? అది కనబడకపోతే అంత గొడవెందుకు? పని మనిషి మంచిది. పాపం దానిమీద అనవసరంగా అనుమానపడి కేకలు వెయ్యడం ఎందుకు? వళ్ళు పాడుచేసుకోవడం ఎందుకు? ఆ తర్వాత అడ్డమైన మాత్రలు మింగడం ఎందుకు?!... **ఏమిటో నీరజకి తల్లి ధోరణి ఏమి అర్థంకావడం లేదు. తల్లి చాదస్తానికి అంతూ పొంతూ** లేకుండా వుంది. అడ్డమైన తిట్లూ తిడ్తే పాపం అది ఏడ్చుకుంటూ వెళ్ళిపోయింది. ఆ తర్వాత నీరజ వంటిల్లంతా జాగ్రత్తగా వెతికేసరికి గ్యాసు సిలెండరు వెనకే దొరికింది ఆ గిన్నె!

ఈమధ్య లలితమ్మ విపరీతంగా దగ్గుతున్నాది. పెద్ద డాక్టరుకి చూపించుకోమంటే డబ్బు దండగ. అదే తగ్గిపోతుందని మొండి కేసింది. డబ్బు... డబ్బు... డబ్బు... డబ్బు దేనికి? అవసరాలకూడా వాడుకోకుండా అంతలా కూడబెట్టేసి ఏంచెయ్యాలని? అన్నయ్య, తను, యిద్దరు తమ్ముళ్ళు! అంతే. యింట్లో ఖర్చులు కూడా ఎక్కువ లేవు. అమ్మ అంత యిదిగా కూడబెట్టినా అది ఎవరో ఒకరు ఖర్చు పెట్టాల్సిందేగా! జీవితాంతం సుఖంగా కూర్చుని తిన్నా సరిపడేంత డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో వుంది! మరి దేనికి ఈ తాపత్రయం?! నీరజకి



## ఇద్దరు భార్యల భట్!

ఒక వ్యక్తికి యిద్దరు భార్యలుండి వాళ్లలో వాళ్లకి ఎన్ని తగవులున్నా ఆ వ్యక్తి మరొకామెతో వుంటే నొచ్చుకోవటం సహజమేమో! ఆ పరిస్థితే ఎదురైంది మహేష్ భట్‌కు. తనకున్న యిద్దరు భార్యలు కిరణ్, సోనిలు ఒక పార్టీలో కలుసుకుని హాయిగా సంభాషించుకుంటుండగా భట్ కొత్త హీరోయిన్ అను అగర్వాల్‌తో "హస్కు" కొడుతున్నాడట. కిరణ్ - సోని తమ మధ్య ఎటువంటి మనస్పర్థలున్నా భర్త మరొకరితో వుండటానికి యిష్టపడక అను అగర్వాల్‌నుంచి భట్‌ను ఎలా దూరంచేయాలా అని పథకం వేసుకుంటున్నారని బొంబాయి ఫిలిం ఫీల్డ్ టాక్ !

# సాహితీ పజిల్

## గళ్ళనుడికట్టు-29

### ఫలితాలు : బహుమతులు

వందలాదిమంది పాఠకులు అమిత ఉత్సాహంతో ఈ పోటీలో పాల్గొన్నారు. వారందరికీ మా అభినందనలు. అయితే సరైన సమాధానం తొమ్మిదిమంది మాత్రం పంపగలిగారు. బహుమతి మొత్తం రు. 200/- లను వీరికి పంచగా ఒక్కొక్కరికి రు. 22/-లు వచ్చాయి. ఈ బహుమతులు త్వరలో నగదు రూపంలో వారికి పంపే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పజిల్ ఒకరు ఎన్ని కూపన్‌లైనా పంపవచ్చు. కాని ఒక్క బహుమతికే అర్హులు. తెల్ల కాగితం మీద వ్రాసిన కూపన్‌లు చెల్లవు. మీరు పంపిన జవాబులు మా వద్ద గల సీలు వేసిన జవాబుకు సరిపోవాలి! ఎడిటర్‌దే తుది నిర్ణయం.

- ఎడిటర్

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 శి | 2 బి | ■ | 3 కే | 4 ప్ర | ము | ■ | 5 లం | క |
| ■ | డా | ■ | ■ | హ్లా | ■ | ■ | గ | ■ |
| ■ | లం | ■ | 6 వె | దు | రు | ■ | రు | ■ |
| 7 వ | ■ | 8 హా | ■ | డు | ■ | 9 ము | ■ | 10 పి |
| 11 సం | జ | యు | డు | ■ | 12 వి | దు | రు | డు |
| తం | ■ | ఫు | ■ | 13 కా | ■ | రు | ■ | గు |
| ■ | 14 వే | ■ | 15 అ | ప్ప | డుం | ■ | 16 మ | ■ |
| ■ | డా | ■ | ■ | ర | ■ | ■ | కు | ■ |
| 17 మా | ద్రి | ■ | 18 వి | పు | ల | ■ | 19 టుం | కం |

### సరైన జవాబులు పంపినవారి పేర్లు

సోమవరపు శ్రీవల్లి (కొల్లూరు), రామరాజు ప్రసాద్(గుంటూరు), బి. శ్రీనివాస్ (తిమ్మసముద్రం), ఆర్. లక్ష్మీనారాయణ (గుంటూరు), కె. దశరథరామిరెడ్డి (భీమునిపట్నం), వి. రేవతి (హైదరాబాద్), టి. రాజేశ్వరీబాయి (పామిడి), వి. సాత్రాజితి (అలుదు), యు.డి. ప్రసాద్ (హైదరాబాద్).

## తాపత్రయం

తల్లిమీద పీకలదాకా కోపం వచ్చింది. జగన్నాథ రావుగారు భార్యని బలవంతంగా హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళేరు. నీరజ కూడా వెంట వెళ్ళింది. ఆవిడ్ని పూర్తిగా పరీక్ష చేసిన డాక్టరు జగన్నాథరావుగార్ని తిట్టేడు.

"ఇంత ఆలస్యం చేసేరేం? రెండు వూపిరి తిత్తులు, మూత్రపిండాలు పూర్తిగా పాడయి పోయేయి! దానికితోడు యితర కాంప్లికేషన్స్ కూడా! ముఖ్యంగా హై. బి. పి. ఆవిడ సర్వైవ్ అవటం కష్టం" అని చెప్పేయగానే తండ్రీ కూతుళ్ళిద్దరూ ఏడుపు ముఖం పెట్టారు. నీరజకి చెప్పలేనంత దుఃఖం ముంచుకొచ్చింది. ఎవరెంత నచ్చచెప్పినా హాస్పిటల్‌లో జాయినవను. యింటి దగ్గరే వుంటానని పట్టుబట్టింది లలితమ్మ. మందులు సరిగ్గా వేసుకోక, ఇంజక్షన్లు సరిగ్గా తీసుకోక, తిండి సరిగ్గా తినక, "నా రోగాన్ని ఆ శ్రీరామచంద్రుడే నయం చేస్తాడు!" అని తన ఆరోగ్యాన్ని మూర్ఖత్వంతో, అజ్ఞానంతో తనే పాడు చేసుకుంది. ఆరోగ్యం ఏమైపోనీ, తన పంతం నెగ్గి హాస్పిటల్‌లో జాయిన్ అవకుండా యింట్లోనే వున్నందుకు తృప్తి. లేక తన ఆరోగ్యం మాట ఎలా వున్నా, డబ్బు కదలకుండా బ్యాంకులో నే వుందన్న తృప్తో తెలీదు ఆఖరికి ఆవిడ నిశ్చింతగా కన్ను మూసింది!

నీరజకి దుఃఖం ఎంత ఆపుకుందామన్నా సాధ్యం కావటం లేదు!...

.........

* * * * *

"నీరజా! ఏంటి తల్లీ! ఆలోచిస్తున్నావు?" అన్న ఆప్యాయమైన పిలుపుకి ఆలోచనల్లోంచి తేరుకుని కళ్ళు తెరచి చూసింది నీరజ.

"ఏంలేదు నాన్నా! అమ్మ జ్ఞాపకం వస్తూంటేనూ..." అంది దుఃఖం తన్నుకొస్తుంటే కళ్ళు తుడుచుకుంటూ.

"పిచ్చిపిల్లా! ఏడిస్తే అమ్మ వచ్చేస్తుందా? ఈ భూమ్మీద ఏదీ కూడా శాశ్వతం కాదమ్మా. ఈ యింటిని యిప్పుడు నువ్వే చక్కదిద్దాలి! వంటిల్లు చూడు. అమ్మ లేకపోతే ఎలా వెలవెలా బోతోందో! వంటిల్లంతా సర్దిపెట్టి వంట ప్రయత్నం చూడమ్మా.." అన్న తండ్రి మాటలకి భయంగా చూసింది నీరజ. ఆమె మనసులో భయంతో కూడిన ఆలోచనలు సముద్ర తరంగాల్లా వువ్వెత్తున లేస్తున్నాయి. తను మళ్ళీ... ఈ తాపత్రయంలో పడి 'అమ్మ'లా తయారవదుకదా. ఆమెకి కొత్తగా భయం పట్టుకుంది! స్టీలుగిన్నెలన్నీ, అందరికీ పంచెయ్యాలన్న పిచ్చి కోరిక ఆ క్షణంలో కలిగింది. కాని తండ్రి ముఖంలోకి చూసిన నీరజ మాట్లాడకుండా లేచింది వంటిల్లు సర్దడానికి!!